సాక్షి జగిత్యాల



అంజన్న సన్నిధిలో పూజలు

కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో ఖానాపూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు రేఖా నాయక్, రవిశంకర్ పూజలు చేశారు.



పత్తి క్వింటాల్‌కు రూ.8,001

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తికి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.8,001 పలికింది. కనిష్టంగా రూ.7,462, సరాసరి రూ.7,911గా నమోదైంది.

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరిగి పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరణ



సబ్ జడ్జి ప్రసాద్

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయంలో సోమవారం ప్రారంభమైన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా కంచె ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యాలయంలో ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ప్రసాద్ జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఆయన హుస్నాబాద్, హుజూరాబాద్, బెల్లంపల్లిలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా పనిచేశారు. 2019లో సబ్ జడ్జిగా పదోన్నతి పొంది ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. తర్వాత కరీంనగర్ అడిషనల్ కోర్టు సబ్‌జడ్జిగా, ప్రిన్సి పల్ సబ్‌కోర్టు జడ్జిగా విధులు నిర్వర్తించారు. 31 మే 2022 నుంచి ప్రస్తుతం జగిత్యాల సబ్ కోర్టు జడ్జిగా పనిచేస్తున్నారు.

కొత్త బస్సు ప్రారంభం

జగిత్యాలటౌన్: ఆర్టీసీ ప్రవేశపెట్టిన కొత్త సూపర్ లగ్జరీ బస్సును కలెక్టర్ రవి జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన సూపర్ లగ్జరీ సర్వీసు జగిత్యాల – హైదరాబాద్ మధ్య నడిపిస్తామని డిపో మేనేజర్ వెంకటేశ్వరప్ప తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మంద మకరంద్, అధికారులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ-ఏ జాబితాలో చేర్చండి




మాట్లాడుతున్న గొడికే అశోక్

మల్లాపూర్(కోరుట్ల): తమ కులాన్ని బీసీ- ఏ జాబితాలో చేర్చాలని ఆరె కటిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొడికే అశోక్ కోరారు. స్థానిక శ్రీవేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కులంలో 90శాతం నిరుపేద కుటుంబాలే ఉన్నాయని తెలిపారు. తమ సంక్షేమం కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్, శేఖర్, రాకేశ్, న్యామతేబాద్ శ్రీనివాస్, న్యామతేబాద్ రాజ్‌కుమార్, కోయల్‌కార్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు నిధులు

ధర్మపురి: భారీవర్షాలు, వరదలతో దెబ్బతిన్న ఎత్తిపోతల మరమ్మతులకు సుమారు రూ.3.65 కోట్లు మంజూరయ్యాయని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గోదావరి తీరంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ రంగానికి నిరంతరం సాగునీరు అందించాలనే లక్ష్యంతో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. అయితే, భారీవర్షాలు, వరదలతో అవి దెబ్బతన్నాయని వివరించారు. వీటి మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఇందులో ఎడపెల్లికి రూ.48.40లక్షలు, జైనాకు రూ.31.50లక్షలు, రాజారం గ్రామానికి రూ.49 లక్షలు, రాయపట్నం గ్రామానికి రూ.69.30 లక్షలు, తిమ్మాపూర్ గ్రామానికి రూ.93 లక్షలు, కోల్వాయి, ఆరెపెల్లి ఎత్తిపోతలకు రూ.85.45 లక్షలు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. మరో 15 రోజుల్లో పనులు ప్రారంభించి యాసంగికి సాగునీరు అందిస్తామని ఆయన వెల్లడించారు.

నిరంతరం విద్యుత్ ఇవ్వాలని నిరసన



బైఠాయించిన రైతు

సారంగాపూర్(జగిత్యాల): వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రకటించినట్లు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలనే డిమాండ్‌తో బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామానికి చెందిన రైతు వెల్మ మహిపాల్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. అనంతరం కలెక్టర్ రవికి ప్రజావాణి ద్వారా వినతిపత్రం అందజేశాడు. అనంతరం అతడు మాట్లాడాడు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా.. రాత్రి సరఫరా కావడంలేదని ఆరోపించారు. రోజూ 12 గంటలకు మించి కరెంట్ ఇవ్వడం లేదని పేర్కొన్నాడు. కాగా, స్పందించిన కలెక్టర్.. అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించినట్లు రైతు తెలిపాడు.



ధర్మపురి: ముక్కోటి వేడుకల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ రవి దంపతులు, పలువురు ప్రముఖులు



కోరుట్ల టౌన్: బారులు తీరిన భక్తులు



ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో..



కోరుట్ల శ్రీవేంకటేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



మల్లాపూర్: సీతారామ విగ్రహాలపై సూర్యకిరణాలు



కొండగట్టు : ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు

ముక్కోటి మొక్కులు


ధర్మపురి: జిల్లాలోని ప్రధాన పుణ్యక్షేత్రాలు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి, బీర్‌పూర్ లక్ష్మీనర్సింహస్వామి, వెల్గొండ శ్రీరామలింగేశ్వరస్వామి, మల్లాపూర్ శ్రీనగరేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం ముక్కోటి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ధర్మపురిలో వేకువజామున 2.30గంటలకు యోగా, ఉగ్ర, శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆశీనులను చేశారు. ఉదయం 5.55గంటలకు మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ రవి సమక్షంలో ఉత్తర ద్వారం తెరిచి భక్తులను అనుమతించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ రవి దంపతులతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా ఆలయం బయటకు తీసుకొచ్చి ఊరేగించారు. ఈసందర్భంగా ప్రముఖులు 2023 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మల్లాపూర్ మండలం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలోని శివలింగం, శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలపై సూర్యకిరణాలు పాక్షికంగా ప్రసరించిన దృశ్యాలను తిలకించిన భక్తజనం పులకించిపోయారు.



కోరుట్ల శ్రీవేంకటేశ్వర ఆలయంలో పూజలు

సుందరంగా.. సువిశాలంగా..

- పట్టాలపై ప్రగతి పరుగులు
- జగిత్యాలలో నూతన మాస్టర్ ప్లాన్ అమలు
- రహదారుల నిర్మాణం, విస్తరణ, జోన్ల గుర్తింపు
- అందుబాటులోకి రెవెన్యూ భూములు, అర్బన్ పార్క్‌లు
- పురపౌరులకు ఆహ్లాదం పంచనున్న పచ్చదనం



కొత్త మాస్టర్ ప్లాన్

జగిత్యాల: మున్సిపాలిటీలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ మేరకు మ్యాప్ రూపొందిస్తూ ఇటీవల పబ్లిక్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వివిధ అభివృద్ధి పనులు చేపడతారు. ప్రధానంగా రహదారుల విస్తరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, ఇండస్ట్రియల్ కారిడార్, జోన్ల గుర్తింపు, అభివృద్ధి చేయాల్సిన స్థలాలు తదితర పనులు చేపడతారు.

2041 అవసరాలకు అనుగుణంగా..

- జగిత్యాల మున్సిపాలిటీకి 1985లో రెండో గ్రేడ్ హోదా లభించింది.
- 2009 సంవత్సరం నుంచి గ్రేడ్-1 మున్సిపాలిటీ కొనసాగుతోంది.
- పట్టణంలో ప్రస్తుతం సుమారు 35 వేల నివాసాలు ఉన్నాయి. దాదాపు 10 చ.కి.మీ. విస్తీర్ణంలో విస్తరించి ఉంది.
- సుమారు లక్షకుపైగా జనాభా కలిగి ఉంది.
- ప్రస్తుతం పట్టణ విస్తీర్ణం, నివాసాలు రెట్టింపు కావడంతో తెలంగాణ మున్సిపల్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ కింద మాస్టర్ ప్లాన్‌కు ఎంపికైంది.
- ప్రస్తుతం జిల్లా కేంద్రంగా జగిత్యాల పట్టణ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.
- కొన్ని గ్రామాలు విలీనం కావడంతో దాని ప్రకారం మళ్లీ మాస్టర్ ప్లాన్ కొనసాగిస్తారు.
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి కలిసి మంత్రి కేటీఆర్‌కు విన్నవించగా.. కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు అవకాశం అందుబాటులోకి వచ్చినట్లయ్యింది.
- దీంతో 2041వ సంవత్సరంలో ప్రజావసరాలకు అనుగుణంగా కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించారు.
- త్వరలోనే ఇది అమలులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

ఫిబ్రవరి 28వరకు సలహాలు.. సూచనల స్వీకరణ

మున్సిపల్ మాస్టర్ ప్లాన్ ముసాయిదాలను ప్రభుత్వం జీవో నంబరు 238 ద్వారా 15 డిసెంబర్ 22న జారీ చేసింది. దీనిప్రతిని బల్దియా నోటీసు బోర్డుపై అతికించారు. 31 డిసెంబరు 2022 నుంచి 28 ఫిబ్రవరి 2023 వరకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు, ఆక్షేపణలు రాతపూర్వకంగా స్వీకరిస్తామని అందులో పేర్కొన్నారు.

కొత్త మాస్టర్‌ప్లాన్‌లోని వివరాలు

ఏరియా	విస్తీర్ణం(హెక్టార్లలో)	శాతం
రెసిడెన్షియల్	2,423.10	39.81
కమర్షియల్	309.84	5.09
ఇండస్ట్రియల్	181.67	2.98
మిక్స్‌డ్	75.86	1.25

పచ్చదనం పెంపొందించడం కోసం..

ఫారెస్ట్	238.68	3.92
బఫర్‌జోన్	324.39	5.33
పార్క్‌లు, ప్లేగ్రౌండ్లు	122.00	2.00

పబ్లిక్, సెమీ పబ్లిక్ జోన్

ఏరియా	విస్తీర్ణం(హెక్టార్లలో)	శాతం
ప్రభుత్వ స్థలాలు	100.12	1.67
ఎడ్యుకేషనల్, రీసెర్చ్	50.08	0.82
మెడికల్, హెల్త్	40.57	0.67
సోషల్ కల్చరల్, రిలీజియస్	32.45	0.53
శ్మశానవాటికలు	9.95	0.16

ట్రాన్స్‌పోర్ట్స్, కమ్యూనికేషన్

ఏరియా	విస్తీర్ణం(హెక్టార్లలో)	శాతం
రోడ్ల విస్తరణ	216.88	3.56
మాస్టర్‌ప్లాన్‌లో కొత్తరోడ్లు	209.72	3.45
రైల్వేలైన్	0	0
రైల్వేస్టేషన్	1.12	0.02
బస్‌డిపో	3.22	0.05
ట్రాక్ టెర్మినల్	5.54	0.10

ఎన్విరాన్‌మెంటల్, సోషల్ ల్యాండ్స్ అవసరాలు

వాటర్ బౌండరీస్	546.18	8.97
హిలాక్స్	372.12	6.11
మైనింగ్	0	0

అభివృద్ధి చేయకూడని స్థలాలు

చేయకూడనివి స్థలాలు..	823.43	13.53

మాస్టర్‌ప్లాన్‌తో మరింత అభివృద్ధి



జగిత్యాల మున్సిపాలిటీలో ఇప్పటికే మాస్టర్‌ప్లాన్ అమలు చేయాల్సింది. మంత్రి కేటీఆర్ సహకారంతో 2041 వరకు కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందించాం. ఇది అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. గతంలోనే జోన్ల మార్పిడితో ప్రజలకు కొంత వెసులుబాటు కలిగింది. తాజా మాస్టర్‌ప్లాన్‌తో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది. – సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

శరవేగంగా ప్రగతి సాధిస్తుంది



ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ కొత్తగా రూపొందించాం. ఇది అమలులోకి వస్తే పట్టణం శరవేగంగా అభివృద్ధి జరుగుతుంది. దీనిపై పబ్లిక్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశాం. మంత్రి కేటీఆర్ సహకారంతో జీవో విడుదలైంది. 2041 సంవత్సరానికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించుకున్నాం.

– బోగ శ్రావణి, మున్సిపల్ చైర్‌పర్సన్

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న ప్రజాప్రతినిధులు

జగిత్యాలటౌన్: ప్రజావాణి ద్వారా అందిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ రవి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యలపై 17 అర్జీలు కలెక్టర్‌కు అందజేశారు. వాటినీ స్వీకరించిన కలెక్టర్.. ప్రజావాణికి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ మకరంద్, అధికారులు పాల్గొన్నారు కాగా, మున్సిపల్‌లోని 12, 13, 22, 30, 31, 35, 42, 46 వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని బల్దియా కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య ఆరోపించారు. ఈమేరకు ప్రజావాణి ద్వారా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

పనులను వేగవంతం చేయాలి

జగిత్యాల: మన ఊరు.. మన బడి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రవి సూచించారు. అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అడిషనల్ కలెక్టర్ లత, మకరంద్ పాల్గొన్నారు.

తిరుపతికి జాతీయ పురస్కారం



తిరుపతిని అభినందిస్తున్న అధ్యాపకులు

జగిత్యాల: స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పడాల తిరుపతికి గ్లేసియార్ జర్నల్ రీసెర్చ్ ఫౌండేషన్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ సంస్థ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రాష్ట్రీయ పురస్కారం ప్రకటించింది. తిరుపతి నేషనల్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ కింద బోధనా రంగంలో చేసిన అత్యుత్తమ కృషికి ఈ అవార్డు ప్రకటించింది. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సుల్తానా, అధ్యాపకులు జ్యోతికిరణ్, జ్యోతిలక్ష్మి, సత్యప్రకాశ్, శంకరయ్య అభినందించారు.

రూ.80లక్షలు దుర్వినియోగం!

- ఎనిమిది మహిళా సంఘాల రుణాలు పక్కదారి
- రీసోర్స్ పర్సన్ నిర్వాకంతో వెలుగులోకి..
- రంగంలోకి దిగిన పోలీసులు.. లోతుగా విచారణ



కోరుట్ల: మహిళా సంఘాలు, అధికారులకు వారధిగా నిలవాల్సిన రీసోర్స్ పర్సన్(ఆర్పీ).. మహిళా సంఘానికి చెందిన రూ.10 లక్షలు డ్రా చేసుకుని రెండురోజుల క్రితం పరారై ఆదివారం రాత్రి పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. ఈక్రమంలో మహిళా సంఘాలకు రుణాలు మంజూరవుతున్న తీరులో గోల్‌మాల్ జరుగుతున్నట్లు తెలిసింది.

సిరిసిల్లలో చిక్కిన వైనం..

- కోరుట్లకు చెందిన మదీనా మహిళా సంఘానికి రావాల్సిన రుణసాయం రూ.10 లక్షలను డ్రా చేసుకుని పరారైన స్వర్ణలతను పట్టుకోవడానికి కోరుట్ల సీఐ రాజశేఖర్‌రాజు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు.
- ఈ క్రమంలో ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తితో సన్నిహితంగా ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకుని ఆరా తీశారు.
- అతడి ద్వారా స్వర్ణలత సిరిసిల్లలో ఉన్నట్లు తెలుసుకుని ఆదివారం రాత్రి ఆమెను పట్టుకుని కోరుట్లకు తరలించారు.

ఇలా నమ్మించింది..

సాధారణంగా మహిళా సంఘం బ్యాంకు నుంచి రుణం తీసుకుంటుంది. అయితే, అందులోని కొందరు సభ్యులకు లోను అవసరం ఉండదు. ఇలాంటి వారిని నమ్మించి.. వారికి ఇవ్వాల్సిన డబ్బును ఆర్పీ తానే వినియోగించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈసొమ్మును బ్యాంకులో చెల్లించలేదు. దీంతో పలువురు సభ్యులకు బ్యాంకు నోటీసులు అందాయి. ఈక్రమంలో ఆరు నెలలుగా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఆర్పీ స్వర్ణలత.. మదీనా మహిళా సంఘానికి మంజూరైన డబ్బు మొత్తం తీసుకుని పరారైనట్లు సమాచారం. కాగా, సుమారు ఏడాదిగా కొన్ని మహిళా సంఘాల్లో రుణం అవసరం లేని మహిళలను నమ్మించి సుమారు రూ.80 లక్షలు వరకు దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

లోసుగులే ఆసరాగా..

- మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసే సమయంలో.. సభ్యుల ఖాతాల్లో కాకుండా బ్యాంకర్లు ఒకే అకౌంట్‌లో రుణానికి సంబంధించిన సొమ్మును జమచేస్తున్నారు.
- ఈ లొసుగును ఆసరాగా చేసుకున్న ఆర్పీ స్వర్ణలత.. మొత్తం రూ.10 లక్షలు స్వాహా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.
- ఇతర బ్యాంకుల్లోనిని సభ్యుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బు జమచేయడం ద్వారా అవినీతికి అవకాశం చిక్కడం లేదు.
- దీనికి తోడు మున్సిపాల్టీలో కొందరు ఆర్పీలు మెప్మా ఇన్‌చార్జి నుంచి అనుమతులు లేకుండా నేరుగా మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడం చర్చనీయాంశంగా మారింది.
- మెప్మాలో చోటుచేసుకునే లోటుపాట్లను ఆసరాగా చేసుకుని ఇన్‌చార్జి అధికారిపై ఒత్తిడి తెచ్చి కొన్ని మహిళా సంఘాలకు ఆర్పీ స్వర్ణలత నేరుగా రుణాలు ఇప్పించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.
- నిబంధలనకు విరుద్ధంగా కోరుట్ల, మేడిపల్లి మండలాలకు చెందిన కొన్నిమహిళా సంఘాలకు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రుణాలు ఇప్పించడం గమనార్హం.
- ఈ రీతిలో సుమారు 8 సంఘాల వారికి రుణం ఇప్పించిన స్వర్ణలత.. డబ్బు అవసరం లేనివారిని నమ్మించి తాను తీసుకుని.. బ్యాంకులో తానే చెల్లిస్తానని నమ్మించినట్లు సమాచారం. ఇలా సుమారు రూ.80 లక్షల మేర దుర్వినియోగం చేసినట్లు తెలిసింది. పోలీసులకు చిక్కిన స్వర్ణలత.. తనకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా మెప్మా అధికారులదే బాధ్యత అని ఓ సూసైడ్ నోట్ రాయడం వెనుక ఆంతర్యం అంతు చిక్కడం లేదు. ఈ నోట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు.. మెప్మా ఇన్‌చార్జి, సిబ్బందిని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఆ విచారణ పూర్తయితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అందరికీ సమన్యాయం దక్కాల్సిందే..



హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు



సంస్థ కార్యాలయం ప్రారంభిస్తున్న జడ్జి నీలిమ

- హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్
- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయం ప్రారంభం

జగిత్యాలజోన్: పేద, ధనిక తేడా లేకుండా అందరికీ సమన్యాయం దక్కాల్సిందేనని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, సుప్రీం కోర్టు పలు కేసుల్లో రాజ్యాంపరమైన హక్కు, ఉచిత న్యాయం అందరికీ అందాలని సూచించిందన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సాయం అందించాలని కోరారు. కక్షిదారులకే కాకుండా ఖైదీలు, నిందితులకూ న్యాయ సాయం అందించాల్సి ఉందని అన్నారు. పౌరులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకోవడానికి, వాటిని అనుభవించడానికి కోర్టులు కృషి చేయాలని కోరారు. హైకోర్టు జడ్జి, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రకారం పేదలకు న్యాయ సాయం అందించేందుకు, లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించేందుకు పార్లమెంట్ 1987లో లీగల్ ఎయిడ్ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దీని ప్రకారం అవసరమైన వారికి ఉచిత న్యాయం, న్యాయ సలహాలు, సూచనలు అందించాలని కోరారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ నీలిమ మాట్లాడుతూ, వివిధ కేసుల్లో న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా న్యాయవాదిని ఉచితంగా నియమిస్తామన్నారు. గ్రామీణులు, విద్యార్థులను చట్టాలపై చైతన్యం చేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయాన్ని జస్టిస్ నీలిమ ప్రారంభించారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎస్వీ శ్రావణ్‌కుమార్, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, రెండో అదనపు జిల్లా జడ్జి వీరయ్య, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సబ్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిహారిక, మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జితేందర్, రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వినిల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

5న కోరుట్లలో మంత్రి హరీశ్‌రావు పర్యటన



మంత్రి హరీశ్‌రావుకు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

జగిత్యాల: ఈ నెల 5న కోరుట్ల నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటించనున్నారని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తెలిపారు. సోమవారం ఆయనను కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని, అక్కడ ఏర్పాటు చేసే సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం కోరుట్ల పట్టణంలో నూతనంగా మంజూరైన డయాలసిస్‌ సెంటర్, బస్తీ దవాఖానాలను మంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: నియోజకవర్గంలోని పలు సమస్యలపై గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిలను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం కలిశారు. నూకపల్లి డబుల్‌ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.25 కోట్లు, చల్‌గల్‌లో వ్యవసాయ మార్కెట్‌ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, నిర్వహణకు మరో రూ.2 కోట్లు ఇవ్వాలని కోరారు.

మంత్రి కొప్పులను కలిసిన టీఎన్జీవో నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: టీఎన్జీవో నాయకులు సోమవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తెలంగాణ నాన్‌ గెజిటెడ్‌ ఉద్యోగుల సంఘం ప్రత్యేక పాత్ర పోషిస్తోందన్నారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం నాయకులు కలెక్టర్‌ రవిని కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు రవిచంద్ర, రవీందర్, భువనేశ్వర్, రాజేందర్, సుగుణాకర్, మధుకర్, శ్రీనివాస్, హరిప్రసాద్, చంద్రిక, మమత, శైలజ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాంపల్లి వద్ద గతనెల 30న బైక్‌ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో గాయపడ్డ పనాస కిరణ్‌కుమార్ (34) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై సహదేవ్‌సింగ్‌ వివరాలు.. కాల్వశ్రీరాంపూర్‌ మండలం వెన్నంపల్లికి చెందిన కిరణ్‌కుమార్ వ్యవసాయపు పనులు చేసేవాడని పేర్కొన్నారు. మృతుడి తల్లి బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

‘పొలాస’ విత్తనాలకు జాతీయ గుర్తింపు

- ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సాగు
- ఎనిమిదేళ్లలో పరిశోధన స్థానం నుంచి 17 రకాల విత్తనాలు విడుదల



పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం

జగిత్యాల అగ్రికల్చర్: ఉత్తర తెలంగాణకు తలమానికంగా నిలిచిన పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం విత్తనాల రూపకల్పనలో ముందుడుగు వేస్తోంది. శాస్త్రవేత్తలు అధిక దిగుబడినిచ్చే, నాణ్యమైన విత్తనాలను ఎప్పటికప్పుడు తయారు చేస్తూ రైతుల అభిమానం పొందుతున్నారు. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎనిమిదేళ్లలోనే అధిక దిగుబడినిచ్చే 17 రకాల విత్తనాలను రూపొందించి, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో నంబర్‌ వన్‌గా నిలిచారు.

కనీసం మూడేళ్లు విత్తన పరీక్షలు

వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ఒక కొత్త విత్తనం బయటకు రావాలంటే కనీసం మూడేళ్లు పడుతుంది. విత్తనాలను ఒక్కదానికొకటి సంకరకరణం చేసి, ముందుగా ల్యాబ్‌లో పరీక్షిస్తారు. తర్వాత వాటిని కొద్దిపాటి విస్తీర్ణంలో సాగు చేస్తారు. అలా వచ్చిన విత్తనాలను నాలుగైదు సీజన్లపాటు ఆయా పరిశోధన స్థానాల్లో పరీక్షిస్తారు. విత్తనం తయారు చేసిన శాస్త్రవేత్త సంతృప్తి చెందితేనే కొద్ది మొత్తంలో అభ్యుదయ రైతులకు ఇస్తారు. వారు సైతం ఎలాంటి తెగుళ్లు రాలేదని, దిగుబడి బాగా వచ్చిందని చెబితేనే వ్యవసాయ విశ్వవిద్యాలయానికి కొత్త విత్తన నివేదిక పంపిస్తారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, విత్తనం తయారు చేసిన శాస్త్రవేత్తతో సంప్రదింపులు జరిపి, సంతృప్తి చెందాకే ప్రభుత్వానికి పంపిస్తారు. సర్కారు సైతం పరిశీలించాకే విత్తనం అధికారికంగా విడుదలవుతుంది.

జాతీయ స్థాయి గుర్తింపు

పొలాస శాస్త్రవేత్తలు 2014 నుంచి 2022 వరకు తయారు చేసిన వరి, మొక్కజొన్న, నువ్వుల విత్తనాలు జాతీయ స్థాయి గుర్తింపు పొందాయి. నువ్వుల విత్తనాలను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో, వరి విత్తనాలను ఛత్తీస్‌గఢ్, కర్నాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సాగు చేస్తున్నారు. మొక్కజొన్న విత్తనాలు పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో అధిక ప్రాచుర్యం పొందాయి. ఇవన్నీ అధిక దిగుబడినివ్వడంతోపాటు తెగుళ్లు, పురుగులను తట్టుకుంటాయి.

పొలాస విత్తనాలివే..

పొలాస పరిశోధన స్థానంలో రూపొందించిన వరి విత్తనాల్లో.. బతుకమ్మ(జేజీఎల్‌-18047), జగిత్యాల వరి-1(జేజీఎల్‌-24423), జగిత్యాల వరి-2(జేజీఎల్‌-28545), జగిత్యాల వరి-3(జేజీఎల్‌-27356), జగిత్యాల వరి-4(జేజీఎల్‌-25958), తెలంగాణ వరి-3(జేజీఎల్‌-21078) ఉన్నాయి. ఇవన్నీ వానాకాలం, యాసంగి సీజన్లకు అనుకూలం. ఎకరాకు 30 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడినిస్తాయి. చలిని, ఉల్లికోడును తట్టుకుంటాయి. నువ్వుల విత్తనాల్లో.. జగిత్యాల తిల్‌-1(జేసీఎస్‌-1020), జగిత్యాల తిల్‌-2(జేసీఎస్‌-2454), తెలంగాణ తిల్‌-1(జేసీఎస్‌-3202) రకాలున్నాయి. తెల్లగింజ రకాలు. పంట కాలం 90 నుంచి 95 రోజులు. వేరుకుళ్లు రోగం, కాండం తొలుపు పురుగు, వెర్రి తెగులును తట్టుకుంటాయి. హెక్టారుకు 900 నుంచి 1,000 కిలోల దిగుబడినిస్తాయి.

పరిశోధనలు సాగుతున్నాయి



రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు సాగుతున్నాయి. ఏటా కొత్త విత్తనాల తయారీ అంత సులభం కాదు. అయినప్పటికీ రైతుల సలహాలు, సూచనలు తీసుకొని, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను రూపొందిస్తున్నాం. మా విత్తనాలకు దేశస్థాయిలో మంచి గుర్తింపు ఉంది.

– డాక్టర్‌ శ్రీనివాస్, వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

చెరువుల మరమ్మతుకు చర్యలు తీసుకోండి

- ఈఎన్‌సీని కోరిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఈఎన్‌సీ నాగేందర్‌రావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్‌(జగిత్యాల): మండలంలోని అర్పపల్లి శివారు రెండు చెరువుల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌(ఈఎన్‌సీ) నాగేందర్‌రావును కలిసి, వినతిపత్రం అందించారు. మొన్నటి వర్షాలు, వరదల కారణంగా అర్పపల్లి శివారులోని మునీశ్వరుల, పటేళ్ల చెరువుల కట్టలు, మత్తడులు తెగిపోయాయన్నారు. దీంతో వాటి కింద సాగు ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ఈ చెరువుల కింద దాదాపు 500 ఎకరాలకు సాగు నీరందుతుందని, వెంటనే మరమ్మతు, కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. పనులకు సంబంధించిన అంచనా వ్యయ వివరాలను అందించారు. దీనిపై ఈఎన్‌సీ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రజలపై లక్ష్మీనృసింహుని కృప

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ధర్మపురి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలకు హాజరు



మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: రాష్ట్ర ప్రజలపై ధర్మపురి లక్ష్మీనృసింహుని కృప ఉందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్వామివారి దేవస్థానంలో సోమవారం జరిగిన ముక్కోటి వేడుకలకు మంత్రి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నృసింహుని దయతో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని పేర్కొన్నారు. దేవస్థానం అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు మంజూరు చేశారని, పనులకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలోనే ఆలయ రూపురేఖలు మారుతాయన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వచ్చిన భక్తులకు దేవస్థానం వారు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ దావ వసంత, మున్సిపల్ చైర్‌పర్సన్‌ సంగి సత్తమ్మ, రెనోవేషన్ కమిటి చైర్మన్ రామన్న, జెడ్పీటీసీ సభ్యురాలు బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో దేశంలోనే నంబర్‌ వన్‌

వెల్గటూర్‌(ధర్మపురి): అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌ వన్‌ స్థానంలో నిలిచిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం వెల్గటూర్ మండలంలోని కప్పారావుపేట, తాళ్లకొత్తపేట, చెగ్యాం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కప్పారావుపేటలో కప్పారావుపేట నుంచి శాఖాపూర్ వరకు రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. తాళ్లకొత్తపేట, చెగ్యాంలలో డంపింగ్ యార్డు, పద్మశాలీ భవనాలను ప్రారంభించారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం తదితర పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సహకార సంఘం చైర్మన్ గోళి రత్నాకర్, బీఆర్‌ఎస్ వెల్గటూర్ మండల అధ్యక్షుడు చల్లూరి రామచంద్రం, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో సంజీవరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

లారీలో అక్రమంగా పశువుల తరలింపు

- 6 జీవాలు మృతి
- డ్రైవర్‌పై కేసు



పశువులను దించుతున్న దృశ్యం

జగిత్యాల క్రైం: మహారాష్ట్ర సరిహద్దు జిల్లా ఆసిఫాబాద్ నుంచి 25 పశువులను అక్రమంగా లారీలో అక్రమంగా తరలిస్తున్నారు. సోమవారం ఉదయం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ శివారులో టైరు పంక్చర్ అవడంతో లారీ రోడ్డు పక్కన ఆగిపోయింది. పశువులు అరవడంతో గోసేవకులు, బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు అలగుర్తి లక్ష్మీనారాయణ అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందించి, లారీని తిప్పన్నపేట శివారులోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్దకు తీసుకెళ్లారు. పశువులను పరిమితికి మించి లారీలో ఎక్కించడం, పశుగ్రాసం, నీరు లేకపోవడంతో 6 జీవాలు మృతిచెందాయి. మరో మూడింటి పరిస్థితి విషమంగా ఉంది. బీజేపీ నియోజకవర్గ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి జిల్లా పశువైద్యాధికారికి సమాచారం అందించడంతో వచ్చి, చికిత్స చేశారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై అనిల్ తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న పశువులను తాటిపల్లి శివారులోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. లారీలో సామర్థ్యానికి మించి పశువులను రవాణా చేయడంతో ఆరు మృతిచెందాయని, వాటికి పోస్టుమార్టం చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, నక్క జీవన్, విష్ణు, జగదీశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కేంద్ర నిధులు కాజేసేందుకే డిజిటల్ కీ

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: కేంద్రం ఇచ్చిన నిధులను కాజేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ కీ విధానం అమలులోకి తీసుకువచ్చిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. నిధుల మళ్లింపును నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు వెళ్లేందుకు బయలుదేరిన ఎమ్మెల్సీని ఆయన నివాసం ఇందిరాభవన్‌లో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనంతరం జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సర్పంచుల తరఫున నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమ నాయకులు, ప్రజాప్రతినిధులను పోలీసులు అరెస్టు చేశారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులపై న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు జువ్వాడి నర్సింగరావు, తాటిపర్తి విజయలక్ష్మి, గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలను నిరసిస్తూ జగిత్యాల తహసీల్ చౌరస్తాలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు.

పోలీసులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వాగ్వాదం

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో సోమవారం ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం స్థానిక బ్రాహ్మణ సంఘ భవనంలో టిఫిన్ చేసి, పేపర్ చదువుతుండగా సీఐలు కోటేశ్వర్, కిశోర్‌లు వచ్చి, అదుపులోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎందుకని ఎమ్మెల్సీ ప్రశ్నించగా హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్లకుండా అని వారు సమాధానం చెప్పడంతో ఆయన మండిపడ్డారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తర్వాత ఎమ్మెల్సీ తన కారులో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి కూర్చున్నారు. ఎస్సై కిరణ్‌కుమార్ సైతం అదే కారులో కూర్చోగా ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ఆయన కారులోనే వెళ్లి, ఎమ్మెల్సీని హౌస్ అరెస్టు చేశారు. దేవస్థానం ఎదుట కాంగ్రెస్ నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్ తదితరులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మంత్రి కోసం పూజలు ఆలస్యం చేస్తారా?

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ముక్కోటి ఏకాదశి పూజలను ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించాల్సి ఉండగా మంత్రి కొప్పుల ఈశ్వర్ రాలేదని ఆలస్యం చేయడం ఏంటని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. ధర్మపురిలో సోమవారం లక్ష్మీనృసింహస్వామి దర్శనం అనంతరం ఆయన మాట్లాడారు. ఉదయం 5 గంటలకు తెరవాల్సిన ఉత్తర ద్వారాన్ని మంత్రి రాలేదన్న కారణంగా 45 నిమిషాలు ఆలస్యంగా తెరవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో ఏనాడూ ఇలా చేయలేదని తెలిపారు. ఈ ఘటనపై దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

డబ్బులు చెల్లించడం లేదని ఆత్మహత్యాయత్నం

గొల్లపల్లి(ధర్మపురి): మండల కేంద్రంలో వాసవిమాత దేవాలయం నిర్మించగా సంబంధిత డబ్బులు ఇవ్వడం లేదని ఆర్యవైశ్య సంఘం గొల్లపల్లి పట్టణశాఖ అధ్యక్షుడు రేణికుంట రాజేశం ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్యవైశ్య సంఘం సభ్యుల తీర్మానం మేరకు రాజేశం ఐదు నెలల క్రితం వాసవిమాత దేవాలయం నిర్మించాడు. కానీ వారు ఇప్పటివరకు ఆయనకు రావాల్సిన డబ్బులు చెల్లించలేదు. ఈ క్రమంలో సంఘం కొత్త కమిటీ ఏర్పాటు చేస్తున్నారని తెలిసిన రాజేశం మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం సాయంత్రం ఒంటిపై పెట్రోల్ పోసుకొని, ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆలయ నిర్మాణ డబ్బులు చెల్లించాలని అడిగితే సభ్యులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు న్యాయం చేయాలని కోరాడు. బాధితుడి కుమారుడు ఆంజనేయులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

‘31’న.. రూ.3.8 కోట్ల మద్యం అమ్మకాలు

- డిసెంబర్‌లో రూ.71.41 కోట్లు
- గతేడాదితో పోలిస్తే తగ్గిన విక్రయాలు



జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లాలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబర్ 31న రూ.3.83 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మద్యం ప్రియులు డిసెంబర్ నెలలో రూ.71.41 కోట్ల విలువైన మద్యాన్ని తాగేశారు. అయితే గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రూ.54 లక్షల మద్యం అమ్మకాలు తగ్గాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. జిల్లాలో 22 బార్లు, 71 వైన్స్‌లు ఉండగా ఇప్పటివరకు 3 బార్లు మూతపడ్డాయని పేర్కొన్నారు.

2022లో రూ.309.10 కోట్లు..

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 71 వైన్స్‌లు, 19 బార్లలో కలిపి 1 జనవరి 2022 నుంచి 31.12.2022 వరకు 60,586 లిక్కర్ బాటిళ్లు, 1,13,711 బీరు బాటిళ్లు విక్రయించారు. రూ.309.10 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి.

128 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు..

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసులు ప్రత్యేక బృందాలతో జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 5 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. 128 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

జగిత్యాల: తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ కార్పొరేషన్, ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్సీ నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణనిస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ అధికారి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులని, 74160 43441, 74160 43442 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సహారా ఇండియాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కోరుట్ల: సహారా ఇండియాపై ఆ సంస్థ ఏజెంట్లు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రవికి ఫిర్యాదు చేశారు. పాలసీల కాలపరిమితి పూర్తయినప్పటికీ డిపాజిట్‌దారులకు డబ్బులు చెల్లించడం లేదన్నారు. ఏదో ఒక కొత్త స్కీం పేరు చెప్పి, కాలయాపన చేస్తున్నారని, దీంతో డిపాజిట్‌దారుల నుంచి తాము తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాండ్ర్యాల నారాయణ, జక్కుల గణేశ్, ముత్యాల నరేష్, రవి, రవీందర్, రామస్వామి పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో వ్యక్తి మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గంగుల లింగమూర్తి(51) మతిస్థిమితం సరిగా లేక జీలకుంట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై మహేందర్ కథనం.. లింగమూర్తికి మతిస్థిమితం సరిగా లేనందున గతనెల 31న ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడటంతో ఓదెల మండలం జీలకుంట, బీమరిపల్లె గ్రామాల మధ్యలో సోమవారం మృతదేహం లభించింది. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాత్కాలిక ఉద్యోగం.. పోటీ అధికం

- కంటి వెలుగు ప్రోగ్రాంలో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు 46 పోస్టులు
- 367 మంది దరఖాస్తు



దరఖాస్తు దాఖలుకు కలెక్టరేట్‌లో బారులు తీరిన నిరుద్యోగులు (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వ ఉద్యోగం కాదు.. కనీసం ఏడాది గడువు ఉన్నదీ కాదు.. అవుట్‌సోర్సింగ్‌లో నియమించే పోస్టులు కూడా కావు.. కేవలం ప్రభుత్వ పథకానికి సంబంధించిన కార్యక్రమంలో ఐదు నెలలపాటు సేవలు అందించడానికి ప్రకటించిన ఉద్యోగాలు మాత్రమే.. తాత్కాలిక ఉద్యోగాల కోసమే నిరుద్యోగులు భారీసంఖ్యలో పోటీ పడటం విశేషం. రోజురోజుకీ నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుండటంతో ఏఉద్యోగ ప్రకటన వెలువడినా.. దరఖాస్తు చేసుకోవడానికి యువత ఆసక్తి చూపుతోందనడానికి కంటి వెలుగు డాటా ఎంట్రీ ఆపరేటర్ నోటిఫికేషన్‌కు అందని దరఖాస్తులే నిదర్శనమని పలువురు విద్యావంతులు అంటున్నారు.

18 నుంచి కార్యక్రమం..

- ఈనెల 18నుంచి ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది.
- జిల్లాలో కంటివెలుగు కోసం 46 బృందాలను అధికారులు నియమించాలని భావిస్తున్నారు.
- వైద్యసేవల కోసం వచ్చేవారి వివరాలను కంప్యూటరీకరణ చేయడానికి డాటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)లు 46 మంది అవసరమని గుర్తించి.. నియామకానికి నోటిఫికేషన్ జారీచేశారు.
- ఇందుకోసం డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పీజీడీసీఏ ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు.
- గత నెలలో దరఖాస్తులు స్వీకరించగా.. 46 పోస్టులకు 367 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- ఒక్కో పోస్టుకు 8 మంది పోటీపడుతున్నట్లు దీనిద్వారా తేలింది.
- ఎక్కువమంది ఉన్నత విద్యావంతులు ఐదు నెలలపాటు ఉపాధి ఇచ్చే తాత్కాలిక ఉద్యోగాలకు పోటీ పడుతుండటం గమనార్హం.
- ఉన్నత చదువులు చదివినా.. ఉద్యోగాలు రాకపోవడంతో ఏదో ఒకపని దొరికితే చాలు అన్నట్లుగా మారిందని పలువురు నిరుద్యోగులు పేర్కొంటుండటం బాధాకరం.

పారదర్శకంగా నియామకాలు



కంటివెలుగు వివరాల నమోదుకు డాటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల కోసం 367 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాం. మెరిట్ ప్రకారం అర్హులను గుర్తించాం. పారదర్శకంగా నియామకాలు చేపడతాం. ఈనెల 18న కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుంది.

– శ్రీధర్, జిల్లా వైద్యాధికారి